# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 12 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మొత్తం సీట్లు 4,236

ఫలితాలు వచ్చిన సీట్లు : 4162
(కడపటి వార్తలు అందేసరికి)

కాంగ్రెస్ 2296
బీఆర్ఎస్ 1156
బీజేపీ 186
ఇతరులు 524

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా

- మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ మద్దతిచ్చిన అభ్యర్థుల విజయం
- బీఆర్ఎస్ రెండో స్థానం
- అర్ధరాత్రి కొనసాగిన కౌంటింగ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో నెగ్గి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకుంది. గురువారం జరిగిన పోలింగ్‌లో 3,834 సర్పంచి పదవులకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డు సభ్యుల స్థానాలకు 65,455 మంది పోటీ పడ్డారు. కడపటి వార్తలు అందేసరికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 2,202 స్థానాల్లో గెలుపొందారు. బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులు 1,125 స్థానాల్లో, బీజేపీ 178 చోట్ల, ఇతరులు 502 స్థానాల్లో విజయం సాధించారు.





ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గణనీయ సంఖ్యలో స్థానాలు గెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో సహజంగానే ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. సిద్దిపేట జిల్లాల్లో బీఆర్ఎస్ మెజారిటీ స్థానాలు దక్కించుకుంది. అలాగే మరో మూడు జిల్లాల్లో కూడా ఆ పార్టీ కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చింది. మొదటి విడత ఫలితాల అంచనాల ప్రకారం, వచ్చే రెండు విడతల్లో పోటీ మరింత హెూరాహెూరీగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఏకగ్రీవం, నామినేషన్లు దాఖలు కాని పంచాయతీలను మినహాయిస్తే దాదాపు 50 శాతం స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే గెలుపొందారు. రానున్న రెండు, మూడు విడతల్లో మరింత మెరుగైన ఫలితాలను రాబట్టాలని ఆ పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ దిశానిర్దేశం చేసింది. ఇక గ్రామ స్థాయిలో బీఆర్ఎస్ బలంగానే ఉందనడానికి ఈ ఫలితాలు సాక్ష్యంగా నిలుస్తాయని ఆపార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. అదే సమయంలో బీజేపీ కూడా గతం కంటే బలాన్ని పెంచుకున్నట్టు తెలుస్తోంది. 2019లో మొత్తం 12,751 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా, అప్పటి అధికార టీఆర్ఎస్ (బీఆర్ఎస్) 7,774 పంచాయతీలను కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 2,709 గ్రామాలకే పరిమితమైంది. బీజేపీ 150 గ్రామ పంచాయతీల్లో నెగ్గింది. ఆ ఎన్నికల్లో ఇతరులు 2105 గ్రామపంచాయతీల్లో విజయం సాధించారు. ప్రస్తుతం తొలి విడత పోలింగ్ ఫలితాలు మాత్రమే వెల్లడయ్యాయి. మరో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఫలితాల ప్రభావం ఆ ఎన్నికలపై ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ మెజారిటీ ఫలితాలు కాంగ్రెస్‌నే వరించాయి. వీటి తుది ఫలితాలు వెల్లడి కావల్సి ఉంది.

తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర విషయాలతో పాటు ఉప సర్పంచ్ ఎన్నికలో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బద్యాతండాలో ఒక్క ఓటు తేడాతో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గెలుపొందడంతో రీకౌంటింగ్ నిర్వహించారు. రెండోసారి అతనే గెలవడం గమనార్హం. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో ఇద్దరు అభ్యర్థులకూ సమానంగా ఓట్లు రావడంతో అధికారులు రీకౌంటింగ్ చేపట్టారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం చిన్న ఎల్కచెర్ల

మిగితా 4వ పేజీలో

## సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు



- తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ..
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ పై హైకమాండ్‌కు వివరించిన సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**


తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్ ముఖచిత్రాన్ని డాక్యుమెంట్ ఆవిష్కరించిందని ప్రశంసించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను సీఎం వారి నివాసాల్లో కలిసి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో సీఎం వెంట మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, సురేశ్ షెట్కార్, మందాడి అనిల్ కుమార్, పోరిక బలరాం నాయక్ ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారి మధ్య చర్చ కొనసాగింది. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సీఎంను ప్రశంసించారు. అలాగే ఈ నెల 13వ తేదీన మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు అగ్రనేతలను ఆహ్వానించినట్టు సీఎం తెలిపారు.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఘనంగా నిర్వహించడంతో పాటు రాష్ట్రానికి రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీలు అభినందనలు తెలిపారు. అగ్రనేతలతో భేటీ అనంతరం మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్‌కు వెళ్లారు. అక్కడ ఆయనకు ఎంపీలు అభినందనలు చెప్పారు. దాదాపు గంట పాటు సీఎం పార్లమెంట్‌లోనే గడిపారు. పలు పార్టీలకు చెందిన ఎంపీలు సీఎం రేవంత్ రెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పార్లమెంట్ నుంచి నేరుగా ఎయిర్ పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ తిరిగి బయలుదేరి వెళ్లారు.

రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అని కొనియాడారు.

## మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు నేను అతిథినే..

- రాహుల్, ప్రియాంకలను ఆహ్వానించాం
- సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

హైదరాబాద్‌లో జరగనున్న లియోనల్ మెస్సీ ఫుట్‌బాల్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను వ్యక్తిగతంగా ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన ఆయన పలు విషయాలను వివరించారు. ఈ నెల 13న ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ హైదరాబాద్‌కు రాబోతున్నారని, ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

తనను కూడా మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఒక అతిథిగా ఆహ్వానించారని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వానికి నేరుగా సంబంధం లేదని, అయితే మెస్సీ వంటి అంతర్జాతీయ క్రీడా చిహ్నం నగరానికి వస్తుండటంతో ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీలో పలువురు జాతీయ నేతలను కలిసి, వారిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు కూడా తెలిపారు.

ఏఐసీసీ అగ్రనేతలతో జరిగిన భేటీలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికలు, పరిపాలన సరళిపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం.

**ఉప్పల్ స్టేడియంలో మెస్సీతో మ్యాచ్.. కట్టుదిట్టమైన బందోబస్తు**

ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖులు భారీగా హాజరయ్యే అవకాశం ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేవలం ఉప్పల్ స్టేడియం పరిధిలోనే రాచకొండ కమిషనరేట్ 2 వేల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తోంది.

**మెస్సీ హైదరాబాద్ పర్యటన షెడ్యూల్**

తేదీ : ఈనెల 13 (శనివారం)

సమయం : సాయంత్రం 4 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి రాక


కార్యక్రమం 1 : ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రత్యేక ఈవెంట్‌లో పాల్గొనడం

కార్యక్రమం 2 : అనంతరం ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్‌కు హాజరు

భద్రత : స్టేడియం పరిధిలో 2,000 మందికి పైగా పోలీసులు నియమించనున్న రాచకొండ పోలీసులు

## భారత్‌లో మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు

- 17.5 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్
- సీఈఓ సత్య నాదెళ్ల




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత్‌లో కృత్రిమ మేధ మరియు క్లౌడ్ టెక్నాలజీ విస్తరణ కోసం మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెడుతున్నట్లు ఆ సంస్థ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల వెల్లడించారు. బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 17.5 బిలియన్ డాలర్లు (సుమారు ?1.46 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. ఇది ఆసియా ఖండంలో మైక్రోసాఫ్ట్ చేసిన అతి పెద్ద ఇన్వెస్ట్‌మెంట్ అని నాదెళ్ల పేర్కొన్నారు.

భారత్‌లో లక్షలాది మందికి కృత్రిమ మేధపై నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక ప్రోగ్రామ్ చేపడుతున్నట్లు తెలిపారు. 2030 నాటికి గిట్‌హబ్ వాడకంలో భారత్ ప్రపంచంలో నంబర్‌వన్ అవుతుందని అంచనా వేశారు.

**కొత్త డేటా సెంటర్లు**

దేశవ్యాప్తంగా క్లౌడ్ ప్లాట్‌ఫారమ్ వేగంగా విస్తరిస్తోందని, 2026 నాటికి కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్ అవుతుందన్నారు. దక్షిణ%–%మధ్య భారతంలో మరో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.జియోతో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం కొనసాగుతున్నట్లు గుర్తుచేశారు. ఈ–శ్రమ్ ప్రోగ్రామ్ ద్వారా అసంఘటిత కార్మికులకు ఏఐ సేవలను అందించవచ్చని సూచించారు. భారత ప్రజలు, సంస్థలు మరింత బలోపేతం కావడం మైక్రోసాఫ్ట్ లక్ష్యమని నాదెళ్ల స్పష్టం చేశారు.

## 17న హైదరాబాద్‌కు రాష్ట్రపతి

**శీతాకాల విడిదిలో భాగంగా ఈనెల 17 నుంచి 21 వరకు బస**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజుల రాష్ట్ర పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ భద్రతా, ట్రాఫిక్, ప్రణాళికను

మిగితా 4వ పేజీలో

## రికార్డు స్థాయిలో 84.28 శాతం పోలింగ్


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా 189 మండలాల్లోని 3,834 పంచాయతీల్లో గురువారం జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 84.28 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.88 శాతం, ఆ తర్వాత మూడు జిల్లాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ జరిగింది. నల్లగొండలో 90.53, సూర్యాపేటలో 90.18, ఖమ్మంలో 90.16 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 71.79 శాతం, ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 75.25, జగిత్యాలలో 77.68, ములుగులో 78.65 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 21.07 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 53.04 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చివరి రెండు గంటల్లో 30 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడంతో మొత్తం 84.28 శాతానికి చేరుకుంది. ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 53,57,277 మంది ఓటర్లకు గాను 45,151,41 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 21,99,267 మంది పురుషులు (84.16 శాతం), 23,157,96 మంది మహిళలు (84.40 శాతం), 78 మంది ఇతరులు (41.27 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికలసంఘం తెలిపింది. .

మూడు పంచాయతీ స్థానాల్లో ఇరువురు అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో అధికారులు లాటరీ ద్వారా విజేతను ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మక్కపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులకు 148 ఓట్లు వచ్చాయి. దాంతో, విజేతను తేల్చడం కోసం అధికారులు లాటరీ తీశారు. ఈ లాటరీలో బీఆర్ఎస్ అభ్యర్థి ఇండ్ల రాజయ్య సర్పంచ్‌గా ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం చిన్న ఎల్క చెర్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు 212 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్‌లోనూ ఇద్దరికీ సమాన ఓట్లు రావడంతో అధికారులు.. టాస్ వేశారు. అందులో కాంగ్రెస్ అభ్యర్థి మరాఠి రాజ్‌కుమార్‌ను అదృష్టం వరించింది. ఇక రేగోడ్ మండలం కొండాపూర్‌లో ఒక్క ఓటు తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి బేగరి పాండరి గెలుపొందారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సూరంపల్లిలోనూ లాటరీ తప్పలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు సమానంగా 276 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయగా బీఆర్ఎస్ బలపర్చిన మైలారం పోచయ్య సర్పంచ్‌గా ఎంపికయ్యారు.

### కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు

## ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం



- కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న విత్తన బిల్లును వెంటనే ఆపివేయాలి
- ఎలాంటి ట్రయల్స్ లేకుండా విదేశీ విత్తనాలు దేశంలోకి వచ్చే ప్రమాదం
- విత్తనాల అంశంలో రాష్ట్రాల పాత్ర లేకుండా చేస్తున్న బిల్లును
- పార్టీలతో కూలంకషమైన చర్చ తర్వాతనే ఈ బిల్లుపై ముందుకు పోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విత్తన బిల్లు డ్రాఫ్ట్‌ను భారత రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. కేంద్రం ప్రతిపాదిస్తున్న ఈ విత్తన బిల్లు వలన రైతన్నలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఈ బిల్లును పూర్తిగా ఆపివేసి, రైతన్నలతో, రైతు సంఘాలతో, నిపుణులతో, రాజకీయ పార్టీలతో చర్చ చేసిన అనంతరం ఈ బిల్లు అంశంపై ముందుకు పోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ముఖ్యంగా ఈ బిల్లులో నకిలీ విత్తనాలను కట్టడి చేసే అంశంపై స్పష్టత లేదని, నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతన్నలకు నిర్దిష్ట సమయంలోనే నష్టపరిహారం అందించే అంశంపై గ్యారంటీ లేదని కేటీఆర్ అన్నారు. దీంతో పాటు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా విత్తనాల ధరలను నిర్ణయించే విధంగా ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయని, గతంలా విత్తనాల ధరల నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకుండా పోతుందని కేటీఆర్ అన్నారు.

నకిలీ విత్తనాల తయారీలో కంపెనీలను బాధ్యులను చేయకుండా, కేవలం అమ్మకదారులను బాధ్యత వహించేలా, కేవలం సప్లై చైన్‌పై నకిలీ విత్తనాల బాధ్యతను ఉంచేలా ఈ చట్టం రూపొందించబడిందని అన్నారు. మరోవైపు, నకిలీ విత్తనాలకు సంబంధించిన అంశంలో జాతీయ స్థాయిలో ఆయా కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేయడం,

మిగితా 4వ పేజీలో

## ప్రభాకర్ రావు కస్టడీ విచారణకు సుప్రీంకోర్టు అనుమతి

- లొంగిపోవాలని ఆదేశం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టడీ విచారణను సుప్రీంకోర్టు అనుమతించింది. నేడు(శుక్రవారం) ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ఆఫీసర్ పి. వెంకట గిరి(ఏసీపీ) ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అయితే కస్టడీ సమయంలో

ప్రభాకర్ రావుపై ఫిజికల్ టార్చర్ చేయకుండా విచారణ చేయాలని సూచించింది. అలాగే మందులు, ఇంటి నుంచి భోజనానికి అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పిటిషనర్ ప్రయోజనాలను, అదే సమయంలో విచారణను సమతుల్యం చేయడానికి తాము ప్రయత్నిస్తున్నట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. అప్పటి వరకు ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేయమని,

మిగితా 4వ పేజీలో

## అమెరికాలో విదేశీ విద్యార్థుల నిలుపుదలకు 'గోల్డ్ కార్డ్'

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**బలగం టీవి, వాషింగ్టన్:**

అమెరికాలో చదువుకున్న విదేశీ విద్యార్థులు చదువు పూర్తయ్యాక స్వదేశాలకు వెళ్లిపోవాల్సి వస్తున్న ప్రస్తుత వలస విధానం "సిగ్గుచేటు" అని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. వలసదారుల కోసం తాజాగా ప్రారంభించిన 'గోల్డ్ కార్డ్' సేవలు ఈ సమస్యను పరిష్కరించనున్నాయని తెలిపారు. వైట్‌హౌస్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ, డెల్ టెక్నాలజీస్ సీఈఓ మైకేల్ డెల్ పాల్గొన్నారు.

**భారత్, చైనా విద్యార్థుల వెనుదిరుగుదల సిగ్గుచేటు: ట్రంప్**

విదేశీ విద్యార్థుల వలస విధానంలో లోపాలు ఉన్నాయని ట్రంప్ స్పష్టం చేశారు."భారత్, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల నుండి అమెరికా అత్యుత్తమ విశ్వవిద్యాలయాలకు వచ్చే విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక అమెరికాలో ఉండలేక స్వదేశాలకు వెళ్లిపోవడం విచారకరం. మన వర్సిటీల్లో చదివిన ప్రతిభావంతుల్ని మనం కోల్పోతున్నాం" అని తెలిపారు. అమెరికాలోకి "గ్రేట్ పీపుల్" రావడం ఒక వరమని, వారిని నిలుపుకునే వలస విధానాన్ని మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు.

వర్సిటీల్లో అద్భుత ప్రతిభ కనబరచిన విద్యార్థులను నియమించుకునేందుకు, అమెరికాలో స్థిరపరిచేందుకు కంపెనీలు గోల్డ్ కార్డులను పొందవచ్చని ట్రంప్ వివరించారు. "టాప్ యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులను నియమించుకున్నా, వారు వీసా సమస్యల వల్ల అమెరికాలో ఉండలేరని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ఎన్నోసారి చెప్పాడు. ఇకపై ఈ సమస్య ఉండదు" అని ట్రంప్ వివరించారు. హార్వర్డ్, ఎంఐటీ, వార్టన్ స్కూల్, ఎన్‌వైయూ వంటి సంస్థల విద్యార్థులకు కంపెనీలు నేరుగా గోల్డ్ కార్డులు ఇచ్చి అమెరికాలోనే ఉద్యోగంలో కొనసాగించవచ్చని సూచించారు.

**గ్రీన్ కార్డు కంటే శక్తివంతమైనదే గోల్డ్ కార్డు**

"గ్రీన్ కార్డు పొందడం కష్టం. కాని గోల్డ్ కార్డు ద్వారా ప్రతిభావంతులు అమెరికాలో దీర్ఘకాలం ఉండొచ్చు. ఆర్థిక వ్యవస్థకు బిలియన్ల డాలర్లు చేరతాయి" అని ట్రంప్ పేర్కొన్నారు.

**గోల్డ్ కార్డు ధర: రూ. 9 నుండి 18 కోట్ల వరకు**

అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హెూవార్డ్ లుట్నిక్ వెల్లడించిన వివరాలు:

వ్యక్తులు: రూ. 9 కోట్లు

కంపెనీలు తమ ఉద్యోగుల కోసం: రూ. 18 కోట్లు

గోల్డ్ కార్డు పొందిన వారికి అమెరికాలో నివాసం, ఉద్యోగం, వ్యాపారం వంటి అన్ని హక్కులు లభిస్తాయి. ఐదు సంవత్సరాల తర్వాత అమెరికా పౌరసత్వానికి అర్హత లభిస్తుంది. వివరాలకు trumpcard.gov వెబ్‌సైట్ చూడవచ్చు.

# మంత్రి కొండా సురేఖపై నాన్-బెయిలబుల్ వారెంట్

● నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ మంత్రి కొండా సురేఖకు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో న్యాయస్థానం ఆమెపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. గురువారం (డిసెంబర్ 11, 2025) ఈ కేసు విచారణకు రాగా, నిందితురాలి గైర్హాజరును న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే ఆమెను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించారు.

కేసు వివరాల్లోకి వెళితే.. కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసు (C.C. No. 307 of 2025) విచారణ దశకు చేరుకుంది. గురువారం రోజున విచారణ ప్రారంభం కావాల్సి ఉండగా, నిందితురాలైన కొండా సురేఖ కోర్టుకు రాలేదు. ఆమె గైర్హాజరుకు సంబంధించి న్యాయస్థానానికి ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం, మినహాయింపు కోరుతూ పిటిషన్ దాఖలు చేయకపోవడాన్ని కోర్టు తప్పుబట్టింది. కోర్టు ప్రొసీడింగ్స్‌కు సహకరించకుండా నిరంతరం గైర్హాజరవుతున్న తీరును సీరియస్‌గా తీసుకున్న న్యాయమూర్తి, ఆమెపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. సాధారణ వారెంట్ లాగా ఇందులో బెయిల్ పొందే హక్కు నిందితులకు ఉండదు. ఈ వారెంట్ అమలు చేసి నిందితురాలిని హాజరుపరిచే బాధ్యతను పోలీసులకు అప్పగించిన కోర్టు, తదుపరి విచారణను 2026, ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. తాజా పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.


# రిటన్ 'హౌస్ ఆఫ్ లార్డ్స్' సభ్యుడిగా ఎన్నికైన ఉదయ్ నాగరాజుకు కేటీఆర్ అభినందన

బలగం టీవీ, హైదరాబాద్

బ్రిటన్ ఎగువ సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) సభ్యుడిగా ఎంపికైన ప్రవాస భారతీయుడు శ్రీ ఉదయ్ నాగరాజు కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ ఆయన ప్రస్థానాన్ని కొనియాడారు. "ఇంగ్లాండ్ రాజు చేతుల మీదుగా హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నామినేట్ అయినందుకు ఉదయ్ నాగరాజు గారికి నా మనస్ఫూర్తిగా అభినందనలు. యూకేలో పబ్లిక్ ఆఫీస్ కోసం పోటీ చేయడం దగ్గరి నుంచి మొదలుకొని.. నేడు ఈ అరుదైన గౌరవం దక్కించుకోవడం వరకు మీ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. మీ కొత్త బాధ్యతల్లో మీకు అంతా మంచే జరగాలని, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# మెస్సీతో ఫోటోకు రూ.10 లక్షలు..

● కేవలం 100 మందికి మాత్రమే అవకాశం




బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, 'ది గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) లియోనెల్ మెస్సీని వ్యక్తిగతంగా కలుసుకునేందుకు, ఆయనతో ఫొటో దిగేందుకు ఫుట్‌బాల్ అభిమానులకు హైదరాబాద్‌లో అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 13వ తేదీన 'ది గోట్ టూర్' కార్యక్రమంలో పాల్గొనేందుకు మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా, చారిత్రక ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మెస్సీతో ప్రత్యేకంగా 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అయితే, ఈ కార్యక్రమం మరియు మెస్సీతో ఫొటో దిగేందుకు నిర్వాహకులు భారీ ధర నిర్ణయించారు. మెస్సీతో ఫొటో కావాలంటే, ఒక్కొక్కరు రూ. 9.95 లక్షలు (ప్లస్ జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుందని నిర్వాహక కమిటీ ప్రకటించింది. ఈ ప్రీమియం అవకాశం కేవలం 100 మందికి మాత్రమే పరిమితం చేయబడింది. ఈ వివరాలను 'ది గోట్ టూర్' నిర్వాహక కమిటీ సలహాదారు పార్వతీ రెడ్డి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మెస్సీకి ఉన్న విశేష ఆదరణ దృష్ట్యా, ఈ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి అభిమానుల నుండి భారీ స్పందన వస్తుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

# ట్రక్కు లోయలో పడి 22 మంది మృతి

బలగం టీవీ, హైదరాబాద్



అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజా జిల్లాలో హయులి యాంగ్ చాగ్లగాం మధ్య 40వ నెంబర్ మైలు రాయి వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ట్రక్కు లోయలో పడి 22 మంది కార్మికులు మృతి చెందారు. వీరంతా అసోంలోని టిన్సుకియా జిల్లాకు చెందిన వారని టిన్సుకియా జిల్లా కమిషనర్ స్వప్నీల్ పాల్ మీడియాకు వెల్లడించారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అంజా జిల్లాలో ఓ వాహనం లోయలో పడినట్టు తమకు సమాచారం అందిందని తెలిపారు. ఘటనా స్థలానికి ఆర్మీ సహాయక బృందాలు చేరుకుని మృతదేహాలను వెలికితీశాయి. గాయపడిన వారిని సహాయక బృందాలు అతికష్టం మీద రక్షించి.. స్థానిక ఆస్పత్రికి తరలించాయి. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# మొదటి ఫేజ్ పోలింగ్ ప్రశాంతం

● ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

● రుద్రంగి, ఆర్ అండ్ ఆర్ కాలనీ శాబాష్ పల్లిలో ఓట్ల లెక్కింపు పరిశీలన




బలగం టీవీ, రుద్రంగి/వేములవాడ అర్బన్

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి ఫేజ్ ఎన్నికల పోలింగ్ శాతం 79.57 గా నమోదు అయిందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. రుద్రంగి, వేములవాడ అర్బన్ మండలాల్లో గురువారం ఓట్ల లెక్కింపు చేపట్టగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొదటి ఫేజ్ పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో స్టేజ్ -2 ఆర్ఓలు, పోలింగ్ ఏజెంట్ సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) పాటిస్తూ వార్డు సభ్యులు, సర్పంచ్ ఫలితాలు ప్రకటించి పరోక్ష పద్ధతిలో ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, సీపీఓ శ్రీనివాసాచారి, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో గెలిచిన సర్పంచులు వీరే...

బలగం టీవీ, హైదరాబాద్

**కోనరావుపేట మండలంలో గెలిచిన సర్పంచులు...**

1.రాజన్న గొల్లపల్లి కొలనూరు సర్పంచిగా బొజ్జం మల్లేశం..

2.వెంకట్రావుపేట సర్పంచ్ గా మంతెన గీతాంజలి సంతోష్ గెలుపు

3.కొండపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వంకాయల గౌతమి, ప్రశాంత్..

4.కోనరావుపేట గ్రామ సర్పంచ్ మాస్కురి కాశీరం

5.గోవిందరావుపేట తండా సర్పంచ్ గా భూక్య తిరుపతి..

6.భూక్య రెడ్డి తండా సర్పంచిగా భానోత్ నరేష్ నాయక్..

7.వట్టిమల్ల గ్రామ సర్పంచిగా గుండా వెంకటేష్ గౌడ్..

8.మంగళ్లపల్లి సర్పంచ్ ఆవురం మానస గెలుపు

9.గొల్లపల్లి (వట్టిమల్ల)గ్రామ సర్పంచ్ గా మాడుగుల ఆమని శ్రీకాంత్..

10.అజ్మీర తండా సర్పంచిగా జయరాం..

11.మామిడిపల్లి సర్పంచ్ గా పన్నాల లక్ష్మారెడ్డి..

12.సుద్దాల సర్పంచ్ గా కుంటెల్లి నాగరాజు..

13.నాగారం సర్పంచ్ గా అప్పాల నాగభూషణం..

14.కనగర్తి సర్పంచిగా మల్యాల స్వామి

15.శివంగలపల్లె సర్పంచ్ గా అంబటి చైతన్య, శేఖర్..

16.మర్దనపేట గ్రామ సర్పంచ్ గజపాక దీపిక వెంకటేష్..

17.బావుసాయి పేట గ్రామ సర్పంచ్ గా షేక్ యాశ్విన్ పాషా..

18.మరిమడ్ల గ్రామ సర్పంచిగా కోల స్వాతి..

19.ధర్మారం సర్పంచిగా మిర్యాల కార్ బాలాజీ..

20.నిజామాబాద్ సర్పంచిగా సింగం శ్రీహరి...

21. పల్లిమక్త సర్పంచిగా జిన్నా అనూష..

22.నిమ్మపెల్లి సర్పంచిగా కమ్మరి స్వప్న,నాగరాజు..

23.కొలనూరు సర్పంచ్ గా జలగం అరవింద్ రావు..

24.మల్కపేట సర్పంచ్ గా బోయిని దేవరాజు గెలుపు..

25 ఎగ్లాస్పూర్ సర్పంచ్ గా పసుల పోచయ్య గెలుపు

**చందుర్తి మండలంలో గెలిచిన అభ్యర్థులు...**

1.చందుర్తి పులి సత్తయ్య (కాంగ్రెస్)

2.మర్రిగడ్డ - దూది మనీషా (కాంగ్రెస్)

3.కొత్తపేట - ఊరడి నరేష్ (బీజేపీ)

4.దేవుని తండా బొఖ్య మోహన్ (టిఆర్ఎస్)

5.ఎగల్ అసలు పత్రి శోభారాణి (టిఆర్ఎస్)

6.జోగాపూర్ షహనాజ్ సమీర్ (బిఆర్ఎస్)

7.కట్టలింగంపేట అవారీ రమేష్ (కాంగ్రెస్)

8.అనంతపల్లె చిలుక బాబు (ఇండిపెండెంట్)

9.అసిరెడ్డి పల్లె- బొజ్జ మల్లేశం( కాంగ్రెస్)

10.రామారావు పల్లి పల్లె వాణి గంగ స్వామి (బిజెపి)

11.లింగంపేట కొక్కుల నరేష్ (బిఆర్ ఎస్) లింగంపేట

12.రామన్నపేట పోతరాజు భారతి - నగేష్ (బిఆర్ఎస్ )

13.కిష్టంపేట దేవరాజు (కాంగ్రెస్)

14.తిమ్మాపూర్ కా పిల్ల శంకర్ టిటిఆర్ఎస్ (బిఆర్ఎస్)

15.మూడపల్లి చిలక మల్లీశ్వరి అంజిబాబు (బిఆర్ఎస్)

16.నర్సింగాపూర్ మరాటి మల్లిక్ (టిఆర్ఎస్)

17.బండపల్లి కటకం మల్లేశం (కాంగ్రెస్ )

18.సనుగుల బుడిగే లావణ్య కాంగ్రెస్)

19.మల్యాల మందాల అబ్రహం )(బిఆర్ఎస్) ఆర్ఎస్

**రుద్రంగి మండలం..**

గ్రామపంచాయతీ సర్పంచులు మొత్తం 10

కాంగ్రెస్ 06, బిఆర్ఎస్ 04

ఏకగ్రీవమైన సర్పంచులు 7

1.గైదిగుట్ట తండా సర్పంచ్, ఇస్లావత్ కిషన్(కాంగ్రెస్)

2.అడ్డాబోర్ తాండ సర్పంచ్, గుగులోత్ మంజుల(కాంగ్రెస్)

3.బడి తండా సర్పంచ్, మలోత్ రాందాస్(బిఆర్ఎస్)

4.వీరుని తాండ సర్పంచ్ , గుగులోత్ మంజుల(కాంగ్రెస్)

5.చింతామణి తాండ సర్పంచ్, గుగులోత్ సింధుజ(కాంగ్రెస్)

6.రూప్లా నాయక్ తాండ సర్పంచ్, భూక్య జవహర్ లాల్(కాంగ్రెస్)

7.సర్పంచ్ తాండ సర్పంచ్, మాలోత్ రజిత(బిఆర్ఎస్)

8.దేగావత్ తండా సర్పంచ్, దేగావత్ సరిత (బిఆర్ఎస్)

9.మానాల సర్పంచ్, బుర్ర శంకర్ గౌడ్ (బిఆర్ఎస్)

10.రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ (కాంగ్రెస్)

**వేములవాడ అర్బన్ మండలం...11 గ్రామాలు**

1. గుర్రంవానిపల్లి - జ్వాల స్వాతి (కాంగ్రెస్)

2. ఆరేపల్లి - ఇటిక్యాల రాజు (కాంగ్రెస్)

3. అనుపురం - షేర్ల రాజేశ్వరి (కాంగ్రెస్)

4. కొడుముంజ - కదిరే రాజకుమార్ (కాంగ్రెస్)

5. శభాష్ పల్లి - ఏటి యాదవ్ (కాంగ్రెస్)

6. సంకెపల్లి - రెడ్డివేణి పర్శరాములు (బిఆర్ఎస్)

7. చింతల్ ఠాన పెండింగ్ చనిపోయిన అభ్యర్థి గెలుపు

8. చీర్లవంచ - మధు కిరణ్మయి (కాంగ్రెస్)

9. మారుపాక - దొబ్బల మల్లేశం (కాంగ్రెస్)

10. చంద్రగిరి - ముత్త సంజన (బీఆర్ఎస్)

11. రుద్రవరం - ఊరడి సునీత (బీఆర్ఎస్)

వెంకట్రావుపేట సర్పంచ్ అభ్యర్థిగా మంతెన గీతాంజలి సంతోష్ గెలుపు

కొండపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వంకాయల గౌతమి ప్రశాంత్-గౌతమి

జయవరం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం

ఏంద్రాల ప్రసాద్‌కు 49 ఓట్ల మెజారిటీ

ఎగ్లాస్పూర్ సర్పంచ్ గా పసుల్లా పోచయ్య గెలుపు

వేములవాడ అర్బన్ మండలం కోడుముంజ గ్రామ సర్పంచ్ గా కదిరే రాజకుమార్ కాంగ్రెస్ విజయం....

వేములవాడ అర్బన్ మండలం గుర్రంవానిపల్లె సర్పంచ్ గాలి స్వాతి కాంగ్రెస్ విజయం

చందుర్తి మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్‌చ అభ్యర్థి బుల్లి నరేశ్ నరేశ్ విజయం

వేములవాడ అర్బన్: శభాష్ పల్లి గ్రామ సర్పంచిగా అన్నబోయిన తిరుపతి యాదవ్ (ఏటి యాదవ్) ఘనవిజయం

వేములవాడ రూరల్ మండలం బాలరాజు పల్లి గ్రామ సర్పంచ్ నేదురి ప్రేమలత (కాంగ్రెస్) విజయం

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి దశ పోలింగ్ రిపోర్ట్..

- **జిల్లాలో తొలి దశ పోలింగ్ 79.57 శాతం నమోదు..!**
- **మొత్తం 1,11,148 ఓట్లలో పోలైన ఓట్లు 88,442**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి దశ పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. తొలి దశలో ఏకంగా 79.57 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ దశలో చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు. ఐదు మండలాల్లో కలిపి మొత్తం 1,11,148 ఓట్లు ఉండగా, వాటిలో 88,442 ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికే 79.57 శాతం పోలింగ్ నమోదైంది.

**మండలాల వారీగా పోలింగ్ వివరాలు..**

| మండలం | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| వేములవాడ రూరల్ | 18,825 | 15,525 | 82.47% |
| కోనరావుపేట | 34,641 | 28,420 | 82.04% |
| చందుర్తి | 28,094 | 21,823 | 77.68% |
| వేములవాడ అర్బన్ | 18,492 | 14,687 | 79.42% |
| రుద్రంగి | 11,096 | 7,987 | 71.98% |



ఈ గణాంకాలను పరిశీలిస్తే, వేములవాడ రూరల్ మండలంలో అత్యధికంగా 82.47 శాతం పోలింగ్ నమోదు కాగా, రుద్రంగి మండలంలో అత్యల్పంగా 71.98 శాతం పోలింగ్ నమోదైంది.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రుల ఆకస్మిక తనిఖీ..

- **మెరుగైన సేవలు అందించాలని ఆదేశించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత సిరిసిల్ల అధ్యక్షతన గురువారం సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు మరియు స్కానింగ్ కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో ముఖ్యంగా ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక భద్రత) ప్రమాణాలు, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ (జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ) పద్ధతులు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు,





ఆసుపత్రి సిబ్బంది వివరాలు, ధరల పట్టికలు (రేట్ల బోర్డులు) మరియు వ్యాధిగ్రస్తులకు కనీస వసతుల లభ్యతను %ణవీడఎఉ% బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలను ఆదేశించారు. ముఖ్యంగా స్కానింగ్ సెంటర్ల రికార్డులను పరిశీలించి, వాటికి సంబంధించిన 'ఫామ్ ఆఫ్ ఆడిట్' పత్రాలను సరైన రీతిలో నింపి, వెంటనే తమ కార్యాలయంలో సమర్పించవలసిందిగా స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ సంపత్ కుమార్ లు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు..



- **ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవ ర్యాలీలు నిషేధం**
- **నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఓట్ల లెక్కింపు పక్రియ సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని,కౌంటింగ్ కేంద్రల వద్ద ఎక్కువ మందిని ఉండకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని మొదటి విడత ఎన్నికల ఫలితాలు



ప్రకటించినప్పటికీ, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు,సభలు,బైక్ ర్యాలీలు,డీజే లు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎంసీసీ అమల్లో ఉన్నందున ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని , నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాని తెలిపారు.ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరికీ బాధ్యత అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఉదయం సందర్శించి పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేల భద్రత పరమైన పలు సూచనలు చేశారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారని జిల్లా ఎస్పీ తెలిపారు.



# ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రుద్రంగి**

రుద్రంగి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తన తన కుటుంబ సభ్యులతో కలిసి హక్కును వినియోగించుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండల కేంద్రంలోని పోలింగ్ బూత్కు తన కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన ఆయన, సామాన్య ఓటర్ల మాదిరిగానే క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు వేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు యొక్క ప్రాధాన్యతను చాటుతూ, బాధ్యతాయుతంగా ఆయన తన ఓటును వినియోగించుకోవడం జరిగింది.

# స్థానిక ఎన్నికల్లో చల్మెడ లక్ష్మీనరసింహారావు దంపతుల ఓటు వినియోగం..

**బలగం టీవీ, కోనరావుపేట/మల్కపేట**



స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వేములవాడ నియోజకవర్గంలో తొలి విడత గ్రామపంచాయతీ పాలకవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మరియు వారి సతీమణి సునీల వారి స్వగ్రామమైన కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు.

# దుబాయిలో అపస్మారక స్థితిలో జగిత్యాల జిల్లా ప్రవాసీ కార్మికుడు

- **కోమా పేషెంట్‌ను భారత్‌కు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభం**
- **పెషేంట్ హైదరాబాద్ కు చేరుకోగానే 'నిమ్స్' లో వైద్యం అందించనున్నట్లు డా. జి. చిన్నారెడ్డి హామీ**

**బలగం టీవీ, జగిత్యాల**



జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం పొలాసకు చెందిన ప్రవాసీ కార్మికుడు ఆరెల్లి గంగరాజం (64) దుబాయిలో అకస్మాత్తుగా గుండె సంబంధిత సమస్యతో అపస్మారక స్థితిలోకి జారిపోయారు. నవంబర్ 12 నుండి దుబాయి అల్-గెసిస్ లోని ఆస్టర్ హాస్పిటల్‌లో కోమాలో చికిత్స పొందుతున్నారు. గంగరాజం భార్య రాజవ్వ ప్రభుత్వ సహాయం కోరుతూ, తేది: 09.12.2025, మంగళవారం నాడు హైదరాబాద్ బేగంపేట ప్రజా భవన్‌లో నిర్వహించిన 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట దరఖాస్తు సమర్పించారు. తన భర్తను దుబాయి నుంచి భారత్ కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ జిఏడి ఎన్నారై విభాగం, దుబాయిలోని ఇండియన్ కాన్సులేట్ తో సంప్రదింపులు ప్రారంభించింది.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి మార్గనిర్దేశం చేశారు. పేషెంట్ కుటుంబ సభ్యులను సీఎం ప్రజావాణి ఇంచార్జి, తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డి వద్దకు తీసికెళ్లారు. పేషంట్ దుబాయి నుండి హైదరాబాద్‌కు చేరుకున్న వెంటనే నిమ్స్ హాస్పిటల్‌లో అత్యవసర వైద్యం అందించేందుకు జి. చిన్నారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పేషెంట్ కుమారుడు జలంధర్, ప్రస్తుతం దుబాయిలోనే ఉండి చికిత్సను పర్యవేక్షిస్తున్నారు. దుబాయి లోని తెలంగాణ సామాజిక సేవకులు రవి డేవిడ్, భారత దౌత్య కార్యాలయం, కంపెనీ యాజమాన్యం, ఆస్పత్రితో సమన్వయం చేస్తున్నారు.

# ‘అఖండ 2’ ప్రీమియర్ షో టికెట్ ధరల పెంపు జీవోపై హైకోర్టు సస్పెన్షన్

- ప్రభుత్వానికి, నిర్మాణ సంస్థకు నోటీసులు
- లంచ్ మోషన్ పిటిషన్‌పై అత్యవసర విచారణ

బలగం టీవీ, హైదరాబాద్

‘అఖండ 2’ సినిమా ప్రీమియర్ షోలకు టికెట్ ధరలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు బ్రేక్ వేసింది. ఈరోజు రాత్రి నిర్వహించనున్న ప్రీమియర్ షోలకుగాను ప్రభుత్వం అనుమతించిన ధరల పెంపును హైకోర్టు తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. అఖండ 2 టికెట్ రేట్ల పెంపును వ్యతిరేకిస్తూ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసరంగా ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ధరల పెంపు జీవో అమలును తక్షణమే నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే సినిమా నిర్మాణ సంస్థ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నోటీసులు పంపిస్తూ వివరణ కోరింది.

‘అఖండ 2’ సినిమా అసలు డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉన్నా, అనుకోని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు డిసెంబర్ 12న అధికారిక విడుదల జరగనుంది. గురువారంప్రత్యేక ప్రీమియర్ షోలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే టికెట్ ధరల పెంపుపై హైకోర్టు తాజా ఆదేశాలు ఇచ్చింది.




# అఖండ 2 నుంచి ‘శివ శివ’ పాట

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ హీరోగా, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ప్రతిష్ఠాత్మక చిత్రం ‘అఖండ 2 : తాండవం’ శుక్రవారం గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైంది. సినిమా రిలీజ్ దగ్గరపడటంతో మేకర్స్ ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేశారు. తాజాగా విడుదల చేసిన ‘శివ శివ’ అనే ఎమోషనల్ ఆడియో సాంగ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కల్యాణ్ చక్రవర్తి రచించిన ఈ పాటను కనకవ్వ, శ్రుతి రంజనీ ఆలపించగా, విడుదలైన కొన్ని నిమిషాల్లోనే విపరీతమైన స్పందన లభించింది. మూవీపై భారీ అంచనాలతో ఎదురు చూస్తున్న అభిమానుల్లో ఈ పాట మరింత ఉత్సాహం నింపింది.

# 17న హైదరాబాద్‌కు రాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాలనీ, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యారోగ్య, రోడ్లు భవనాలు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ తదితర అన్ని ప్రభుత్వ విభాగాలు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతులు, తేనెటీగ లను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ.ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డీజీపీ మహేష్ భగవత్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభాకర్ రావు కస్టడీ విచారణకు సుప్రీంకోర్టు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

విచారణ ముగించకుండా అలాగే హెూల్డ్‌లో ఉంచుతామని పేర్కొంది. గురువారం ఈ పిటిషన్ పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జి) తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూత్రా, ప్రభాకర్ రావు తరపున న్యాయవాది రంజిత్ కుమార్‌లు వాదనలు వినిపించారు.తొలుత పిటిషనర్ తరపు రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తిగా కట్టు కథ అని ఆరోపించారు. పొలిటికల్ కక్ష సాధింపులో భాగంగా ప్రభాకర్ రావును ఇందులో ఇరికించారన్నారు. ఈ కేసులో ఏ2, ఏ3, ఏ4, ఏ5, ఏ6లుగా ఉన్న... ప్రణీత్ రావు, భుజంగ రావు, మేకల తిరుపతన్న, రాధాకిషన్ రావు, శ్రవణ్ కుమార్‌గా చేర్చినట్టు చెప్పారు. వీరిలో శ్రవణ్‌కుమార్ సుప్రీంకోర్టు నుంచి ముందుస్తు బెయిల్, మిగిలిన అధికారులు హైకోర్టు, ట్రయల్ కోర్టుల నుంచి బెయిల్ పొందినట్టు తెలిపారు. ఎస్ఐబీ చీఫ్‌గా కేవలం వామ పక్ష తీవ్రవాదం(ఎల్ డబ్ల్యూఈ) కు సంబంధించిన సమాచారాన్ని రికార్డు చేయడం వీరి బాధ్యతని అన్నారు. ఇందుకు సంబంధించి టెలికం చట్టాలు, టెలిగ్రాఫ్ రూల్ 17, ఐటీ రూల్ 22 లు ఉన్నాయన్నారు. మధ్యలో తుషార్ మెహతా జోక్యం చేసుకొని జడ్జీలు కూడా ఎల్‌డబ్ల్యూడీ కేటగిరిలోకి వస్తారా? అని ప్రశ్నించారు. ఇందుకు రంజిత్ కుమార్ స్పందిస్తూ... అసలు జడ్జీల ఫోన్ ట్యాపింగ్ అనేది పూర్తిగా అవాస్తవం అని కోర్టుకు నివేదించారు. దీనిపై కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో అన్ని అంశాలను పొందుపరిచినట్టు చెప్పారు. మరోవైపు చీఫ్ సెక్రెటరీ నేతృత్వంలోని జీఏడీ సెక్రెటరీ, లా సెక్రెటరీతో కూడిన ఎఫెక్స్ బాడీ ప్రతి రెండు నెలలకు ఒకసారి ఎల్‌డబ్ల్యూడీ విధానాన్ని మానిటరింగ్ చేస్తుందన్నారు. 27.9.23 నుంచి 30.11.2023లో ఈ కమిటీ చేసిన రివ్యూలో... పూర్తిగా లీగల్ ఆథరైజేషన్‌గానే దేశ వ్యతిరేక, ఎల్‌డబ్ల్యూడీ సంబంధించిన చర్యలు చేపట్టినట్టు తేల్చిందని చెప్పారు. విపక్షాలు (ఆనాడు కాంగ్రెస్ నేతలు) చేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరాధారమని 27.10.2023న కేంద్ర ఎన్నికల సంఘానికి డీజీపీ రిపోర్ట్ ఇచ్చినట్టు వివరించారు.

# రెండో టీ20 సౌతాఫ్రికాదే

- 51 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం
- విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగిన క్వింటన్ డికాక్ (90)
- ఒంటరి పోరాటం చేసిన తిలక్ వర్మ (62)
- 4 వికెట్లతో టీమిండి యాను దెబ్బతీసిన ఒట్నీల్ బార్ట్‌మన్



బలగం టీవీ, హైదరాబాద్

సౌతాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో టీమిండియా భారీ ఓటమి చవిచూసింది. సమష్టిగా రాణించిన సఫారీలు 51 పరుగుల తేడాతో భారత జట్టును చిత్తు చేస్తూ సిరీస్‌లో సమం చేశారు. భారీ లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగుల భారీ స్కోరు చేసింది. ప్రధానంగా క్వింటన్ డికాక్ (90బీ 46 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సులు) భారత బౌలర్లను తీవ్రంగా ఇబ్బందిపెట్టాడు. అతనికి తోడుగా డోనవన్ ఫెర్రెయిరా (30 నాటౌట్), డేవిడ్ మిల్లర్ (20 నాటౌట్) మెరుగైన మద్దతు అందించారు.

భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి %–2/29, అక్షర్ పటేల్ 1 వికెట్ తీయగా జస్‌ప్రీత్ బుమ్రా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినప్పటికీ వికెట్ ఖాతా తెరవలేకపోయాడు.

**ఒంటరిగానే పోరాడిన తిలక్ వర్మ**

214 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో భారత్ 19.1 ఓవర్లలోనే 162 పరుగులకు ఆలౌటైంది. ప్రధాన బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరడంతో భారత్ ప్రారంభంలోనే ఒత్తిడికి గురైంది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (0) గోల్డెన్ డక్‌గా ఔటవ్వగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5) మరోసారి విఫలమయ్యాడు. అభిషేక్ శర్మ (17), హార్దిక్ పాండ్యా (20), జితేష్ శర్మ (27), శివమ్ దూబే (1) కూడా ఎక్కువసేపు నిలవలేదు. ఒక్కడే తిలక్ వర్మ (62, 34 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులు) ధాటిగా బ్యాటింగ్ చేస్తూ భారత ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. చివర్లో ఎంగిడి బౌలింగ్‌లో అతను ఔటవ్వడంతో భారత పతనం పూర్తయింది.

సౌతాఫ్రికా బౌలర్లలోఒట్నీల్ బార్ట్‌మన్ – 4/24, లుంగీ ఎంగిడి, మార్కో జాన్సెన్, లుతో సిపమ్లా – తలా 2 వికెట్లు తీసి భారత బ్యాటింగ్‌ను చిత్తు చేశారు. భారీ లక్ష్య ఛేదనలో భారత్ ఏ దశలోనూ ప్రతిఘటన చూపలేకపోగా, చివరకు 51 పరుగుల తేడాతో ఓటమిని మూటగట్టుకుంది.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా

(మొదటి పేజీ తరువాయి)

గ్రామంలో ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో రీకౌంటింగ్ నిర్వహించారు. అయినా సమానంగా రావడంతో టాస్ వేసి సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. రేగోడ్ మండలం కొండాపూర్‌లో ఒక్క ఓటు తేడాతో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి బేగరి పాండరి గెలుపొందారు. యాదాద్రి జిల్లా లక్ష్మక్కపల్లిలోనూ సమానంగా ఓట్లు రావడంతో లాటరీ పద్ధతి ద్వారా సర్పంచ్ ఫలితాన్ని వెల్లడించారు.

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సూరంపల్లిలోనూ లాటరీ తప్పలేదు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు సమానంగా 276 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయగా బీఆర్‌ఎస్ బలపరిచిన మైలారం పోచయ్య సర్పంచ్ అయ్యారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం గంగాపూర్ గ్రామంలో టాస్ పద్ధతిలో బీఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలిచారు. జామ్ పల్లి లక్ష్మీ, గడ్డం శ్యామల ఇద్దరు అభ్యర్థులకు సమానమైన ఓట్లు రావడంతో అధికారులు టాస్ వేసి విజేతను ప్రకటించారు. కొణిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామ, మధిర మండలం అల్లినగరం గ్రామంలోటీడీపీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు.


**జగిత్యాల జిల్లాలో తల్లిపై కూతురు విజయం**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో తల్లిపై కూతురు పోటీ చేసి గెలుపొందింది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని తిమ్మాయపల్లి గ్రామంలో తల్లి గంగవ్వపై కూతురు పల్లెపు సుమలత పోటీ చేసి గెలుపొందింది. ఇద్దరి మధ్య హెూరాహెూరి పోటీ జరిగాక తల్లిపై కూతురు 91 ఓట్ల తేడాతో విజయం సాధించింది.

**చనిపోయినా విజయం**

సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చింతల్‌ఠాణా గ్రామంలో రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన సర్పంచ్ అభ్యర్థికి అత్యధిక ఓట్లు రావడంతో ఫలితం ప్రకటనపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. తిరిగి ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.మునుగోడు నియోజకవర్గం కచలాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ స్వీపర్‌గా పనిచేస్తున్న ఏర్పుల బాబు సర్పంచ్‌గా రెండు ఓట్లతో గెలుపు..

**సర్పంచ్‌గా గెలిచిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తండ్రి..**



మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తండ్రి గంటకండ్ల రామచంద్రారెడ్డి సర్పంచ్‌గా గెలుపొందారు. 95 ఏళ్ల వయసులో ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన మండల కేంద్రమైన నాగారం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తద్వారా రాష్ట్ర చరిత్రలో అత్యధిక వయస్కుడైన సర్పించ్‌గా రామచంద్రారెడ్డి రికార్డు నెలకొల్పారు.

# కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

భారీ పెనాల్టీలు, కఠిన జైలు శిక్ష వంటి అంశాలకు ఇందులో పెద్దగా ఆస్కారం లేదని కేటీఆర్ అన్నారు.

దీంతో పాటు సాంప్రదాయంగా రైతన్నలే విత్తనాలను తయారు చేసుకొని పండించుకునే వ్యవసాయ సాంప్రదాయాలు ఇప్పటికీ అనేక చోట్ల ఉన్నాయని, అయితే ఇలాంటి రైతన్నల సమూహానికి ఈ బిల్లులో ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందని అన్నారు. వీటితో పాటు విదేశాల నుంచి నేరుగా ఆయా కంపెనీలు ఎలాంటి విత్తన ట్రయల్స్ లేకుండానే దేశంలో తమ విత్తనాలను అమ్ముకునే విధంగా సులభమైన నిబంధనలు ఉన్నాయని, వీటి వలన దేశీయ విత్తన భద్రత, విత్తన సార్వభౌమత్వం ప్రమాదంలో పడుతుందని కేటీఆర్ అన్నారు.

ఈ అంశానికి సంబంధించి రాష్ట్రాలకు, రాష్ట్రంలోని వ్యవసాయ యూనివర్సిటీలకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండా చేశారని అన్నారు. దీంతో పాటు ఈ మొత్తం బిల్లు రాష్ట్రాల పరిధిలోని వ్యవసాయ రంగంలో కీలకమైన విత్తనాల అంశంపై కేంద్ర ఆధిపత్యానికి దారితీస్తుందని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రాలు సొంత చట్టాలు చేసుకుని ముందుకు పోయే అంశాన్ని బలహీనం చేస్తుందని కేటీఆర్ అన్నారు.

అందుకే రైతే కేంద్రంగా ఉండే విత్తన బిల్లును రూపకల్పన చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ఈ అంశంలో ఈజ్ ఆఫ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు ఆధిపత్యం అప్పగించే ప్రయత్నాలను పక్కన పెట్టాలని కేటీఆర్%ా% తమ పార్టీ తరఫున ప్రతిపాదించిన సవరణల్లో పేర్కొన్నారు. దీంతో పాటు విత్తన సార్వభౌమత్వం, దేశీయ బయోసేఫ్టీ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్రాల అంశంపై కేంద్రానికి ఆధిపత్యం ఇవ్వకుండా రూపకల్పన చేయాలని ఈ బిల్లుకు సవరణలు ప్రతిపాదించారు. దీంతో పాటు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతన్నలకు ఎకరానికి పండే పంటలో గరిష్ఠ ఉత్పత్తి మేరకు నష్టపరిహారం నిర్దిష్ట సమయంలో అందేలా కఠిన నిబంధనలు ఇందులో ఉంచాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వం కంపెనీల ప్రయోజనాల కోసం కాకుండా రైతన్నల ప్రయోజనాలకు, వ్యవసాయ సంక్షేమ అభివృద్ధికి ఉపయోగపడేలా అత్యంత పారదర్శకంగా, కఠినమైన నిబంధనలతో కూడిన విత్తన బిల్లును తీసుకురావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ సూచించారు. త్వరలోనే ఈ అంశంపై మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి గారితో పాటు ఎంపీ వినోద్ కుమార్ గారి ఆధ్వర్యంలో పార్టీ తరఫున ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్రానికి మరిన్ని సూచనలు ఇస్తామని కేటీఆర్ తెలియజేశారు.